క్లుప్తంగా

గంగమ్మకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలో గల గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అభిషేకాలు నిర్వహించి పట్టు వస్త్రాలు, పూల మాలలతో అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్య నిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్‌రెడ్డి అన్ని ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో గల సాయిబాబా, ఆంజనేయస్వామి, అక్కదేవతలు, వీరభద్రస్వామి, వైద్యనాథేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోర్కెలు తీర్చే తల్లి అచ్చవెల్లి గంగమ్మ



పులివెందుల రూరల్ : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా అచ్చవెల్లి గంగమ్మ ఎంతో ప్రసిద్ధి చెందారు. పులివెందుల మండల పరిధిలోని అచ్చవెల్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చవెల్లి గంగమ్మకు ఆదివారం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి పులివెందులతోపాటు చట్టుపక్కల గ్రామాల ప్రజలే కాక కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. వారు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

తెలుగు మీడియాన్ని కొనసాగించాలి

కడప ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియాన్ని కొనసాగించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఆదివారం కడపలోని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు పాఠశాలలు తమకు నచ్చిన భారతీయ భాషను బోధనా మాధ్యమంగా ఎంపిక చేసుకునే వెసులుబాటును సీబీఎస్‌ఈ ఇటీవల కల్పించిందన్నారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఇంగ్లీష్ మీడియంతోపాటు తెలుగు మీడియాన్ని ప్రవేశపెట్టాలన్నారు. విద్యార్థులు మాతృభాషలో చదవడం వల్ల వారిలో నైపుణ్యాలు మెరుగవుతాయన్నారు. అలాగే పెండింగ్ డీఏలతోపాటు 12వ పీఆర్సీ నిధులను విడుదల చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ శేషగిరిరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, ఎం. గంగరాజు, కట్టా గంగాధర తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిక్షేత్రం పరిశీలన

కాశినాయన : మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన జ్యోతిక్షేత్రాన్ని రాష్ట్ర అటవీ చీఫ్ కన్జర్వేటర్ నాయక్ ఆదివారం సందర్శించారు. జ్యోతి క్షేత్రంలో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడాన్ని ఆయన గమనించారు. అనంతరం చెలిమెబావి వద్ద ఉన్న అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈయన వెంట డీఎఫ్‌ఓ సందీప్‌రెడ్డి, ఫారెస్టు రేంజ్ అధికారి రఘురామిరెడ్డి, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆశా'లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

బద్వేలు అర్బన్ : ప్రజారోగ్యం కోసం క్షేత్రస్థాయిలో ప్రాణాలను పణంగా పెట్టి నిరంతరం పని చేస్తున్న ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాడ్ చేశారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయం జె.వి.భవన్‌లో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న ఆశా కార్యకర్తలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఆశాల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 22న కడప కలెక్టరేట్ ఎదుట నిర్వహించబోయే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మరియమ్మ, శాంతమ్మ, పట్టణ నాయకురాళ్లు ధనమ్మ, శ్యామల, వెంకటసుబ్బమ్మ, లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పోరుమామిళ్ల (అట్లూరు) : పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ సీటి సంఘం అధ్యక్షులు, మాజీ మార్కెట్‌యార్డు డైరెక్టర్ ధనిశెట్టి ఓబయ్య సతీమణి శనివారం గుండెనొప్పితో మృతి చెందింది. ఆదివారం మాజీ ప్రభుత్వ సలహాదారు పోతిరెడ్డి నాగార్జునరెడ్డి ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.

మత సామరస్యానికి ప్రతీక మొహర్రం

- ఈ నెల 18న పండుగ

వల్లూరు : హిందూ ముస్లింలందరూ కలిసికట్టుగా జరుపుకొనే మొహర్రం పండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇది పేరుకు ముస్లింల పండుగైనా పలు గ్రామాల్లో హిందువులు కూడా సంక్రాంతి, ఉగాది, దీపావళి, దసరాలతో సమానంగా ప్రాధాన్యతనిస్తూ జరుపుకొంటున్నారు. కుల మతాలకతీతంగా వెండి, ఇత్తడి పంచలోహాలతో ఎవరి శక్తికొద్ది వారు మొక్కుల రూపంలో పీర్లను తయారు చేయించి ప్రార్థనలు చేయడం విశేషంగా చెప్పుకోవచ్చు. తాము చేయించిన పీర్లకు ఏటా మొహర్రం సందర్భంగా భక్తులు పూలు, బట్టలు అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఏటా మొహర్రం నెలలో నెలవంక కన్పించిన మూడవ రోజు.. అంతవరకు పెట్టెలో భద్రపరిచిన పీర్లను నిర్వాహకులు దించి, శుభ్రపరిచిన అనంతరం చదివింపులు చేసి ప్రత్యేక ప్రార్థనలతో పీర్ల చావిడిలో నిలుపుతారు. నిర్దేశిత దినాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో పీర్లను ఊరేగిస్తారు. ఈ సందర్భంగా చక్కెర, పప్పులు, బొరుగులు, బెల్లంలను భక్తులు చదివింపులుగా అందజేసి, అనంతరం అందరికీ పంచి పెడతారు. ఈ పర్వదినాలలో చివరి మూడు రోజులు ముఖ్యమైనవి. పీర్ల ముందు అగ్నిగుండాలు ఏర్పాటు చేస్తారు. గ్రామోత్సవాల అనంతరం పీర్లను మోస్తూ అందులో నడుస్తారు. మొహర్రం రోజు ఉదయం పీర్లు సలాములందుకుంటాయి. అనంతరం సాయంత్రం అమరులైన పీర్లను తిరిగి ఊరేగించి రకరకాల వేషధారణలు, కర్రసాములతో ఒకరిపైనొకరు గంధం, రంగులు చల్లుకుంటూ పండుగను వైభవోపేతంగా నిర్వహిస్తారు.

పానకం కడవలతో నైవేద్యం

పెద్దగుండం, చిన్నగుండం కాలే రెండు రోజులు భక్తులు తమ గృహాల నుంచి డప్పులు, మేళతాళాలతో పానకం కడవలను పీర్ల చావిడి వద్దకు తెచ్చి పీర్లకు చదివింపులు ఇచ్చి నైవేద్యాన్ని అందరికీ పంచి మొక్కులు తీర్చుకుంటారు. దీనివల్ల తమ కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం.



వల్లూరులో కొలువు దీరిన పీర్లు

వల్లూరు మండలంలోని వల్లూరు, పెద్దపుత్త, తొప్పెట్ల, దిగువపల్లె తదితర గ్రామాలతోపాటు జిల్లాలోని పలు గ్రామాల్లో హిందూ ముస్లింలు కలిసికట్టుగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహిస్తారు.

విశిష్టత

ముస్లిం క్యాలెండర్ హిజ్రీ ప్రకారం 12 మాసాలలో మోహర్రం మొదటి నెల. ఈ నెలలో నెలవంక కనిపించిన మూడవ రోజునుంచి మొహర్రం ఉత్సవాలు ప్రారంభమవుతాయి. ఇస్లాం మత ధర్మం కోసం దేవుని మార్గంలో ప్రాణాలర్పించిన త్యాగమూర్తిగా హజరత్ ఇమామ్ హుసేన్ నిలిచాడు. మమమ్మద్ ప్రవక్త ముని మనవడైన ఆయనను స్మరించుకుంటూ ఈ ఉత్సవాలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. మొహర్రంను పీర్ల పండుగ అని కూడా పిలువడం పరిపాటి. ఈ నెల 18న మొహర్రం పండుగను జరపడానికి నిర్వాహకులు అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశారు.

కొలువు దీరిన పీర్లు

జమ్మలమడుగు : మొహర్రం పండుగ సందర్భంగా పట్టణంలోని పలు ప్రాంతాలలో పీర్లు కొలువు దీరాయి. ఆదివారం ఏడవ రోజు కావడంతో పట్టణంలోని కోటవీధి, గూడుమస్తాన్ వల్లి దర్గా, మిటాయిగిరి వీధి, పెద్దపోస్టాఫీసు తదితర ప్రాంతాలలో పీర్లను కూర్చోబెట్టారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక పూజలను స్థానిక ప్రజలు నిర్వహించారు.



జమ్మలమడుగులో గూడు మస్తాన్‌వలి దర్గాలోని పీర్లు



ఎగువ లింగాలలో పీర్లను ఊరేగిస్తున్న ప్రజలు

స్థానిక పెద్దపోస్టాఫీసు వద్ద ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 17న పీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని పీర్ల చావిడిలో పీర్లను కొలువు దీర్చారు. మొహర్రం రోజున పీర్లను ఏటికి తరలించి పండగను జరుపుకొంటారు.

కొండాపురం : మండలంలోని పలు గ్రామాల్లో పీర్లు కొలువు దీరాయి. బెడుదూరు, యనమలచింతల, ఏటూరు, కొండాపురం తదితర గ్రామాల్లో పీర్లచావిడి వద్ద పీర్లు కొలువుదీరాయి. బెడుదూరు గ్రామంలో ఆదివారం రాత్రి పీర్లు ఊరేగించారు. మంగళవారం పీర్లతో అగ్నిగుండం ప్రవేశం చేస్తారు. బుధవారం ఏటికి పోతాయి.

ప్రారంభమైన వేడుకలు

లింగాల : లింగాలలో ఆదివారం మొహర్రం వేడుకలు ఘనంగా ప్రారంభం అయ్యాయి. గ్రామ ప్రజలు పీర్లను ఎత్తుకుని గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఇంటింటా భక్తులు ఇచ్చే చెక్కర చదివింపులు చేస్తూ లింగాల, మండలంలోని ఎగువ, దిగువ, లింగాలలో గ్రామోత్సవం నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన



గ్రూప్ డ్యాన్స్ చేస్తున్న బాలురు

పులివెందుల టౌన్ : పులివెందుల పట్టణంలోని శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చిన్నారులు, పెద్దల ఆటపాటలతో ప్రాంగణమంతా సందడిగా మారింది. శ్రీరాజా కళానిలయం మాస్టర్ రాజా తమ చిన్నారులతో అదివో అల్లదివో శ్రీహరి వాసము అంటే సాగే ఈ పాటతో మొదలై రాధిక రాధిక రాధిక ముందుక ఎనకక కిందికా మీదికా, సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నాసామీ తదితర పాటలకు చిన్నారులు వేసిన నృత్యాలు అందిరినీ అలరించాయి. కార్యక్రమంలో శిల్పారామం పరిపాలనాధికారి సుధాకర్ పర్యవేక్షించారు.

మానవ సేవే మానవతా సంస్థ లక్ష్యం



మాట్లాడుతున్న రిటైర్డు ఎంఈఓ మస్తాన్‌రెడ్డి

జమ్మలమడుగు : మానవులకు సేవ చేయడం అంటే దేవుడికి సేవ చేయడమే అనే సిద్ధాంతంతో వెలసిన సంస్థ మానవతా స్వచ్ఛంధ సంస్థ అని రిటైర్డు ఎంఈఓ మస్తాన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎస్పీ డిగ్రీ కాలేజీలో మానవతా స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గం ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవ చేయాలనే కోరిక కలిగిన వారిని తమ సంస్థలో సభ్యులుగా తీసుకుని తద్వారా ప్రజలకు మంచి చేయడం జరుగుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మానవతా స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడిగా బీటీ నరసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా సంజీవరాయుడు, ప్రధాన కార్యదర్శిగా పార్థసారధి, కోశాధికారిగా సుధాకర గుప్త, జాయింట్ సెక్రటరీగా రామమోహన్‌రెడ్డి తదితర సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెంటెంట్ రఫిక్‌పాషాకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యుడు శివశంకర్‌రెడ్డి, డిగ్రీకాలేజీ ప్రిన్సిపల్ నాగేశ్వరరెడ్డి, శివగణపతి, ఈశ్వరరెడ్డి, పల్లా తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మురికి కూపం.. విద్యార్థులకు శాపం

ముద్దనూరు : మండల కేంద్రంలో రైల్వేస్టేషన్ కొత్త రహదారిలో కోనేటి గుంత మురుగునీటి నిల్వతో దుర్వాసన వస్తోంది. ఈ మురుగు నీటి కుంట పక్కనే ఎస్సీ బాలుర వసతిగృహంతోపాటు సమీపంలోనే జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఉంది. ఈ నీటికుంటలో పందుల సంచారంతోపాటు పలువురు చెత్తా చెదారం వేస్తుండడంతో అపరిశుభ్రంగా తయారైంది. దుర్వాసన, దోమల బెడదతో అనారోగ్యం పాలయ్యే ప్రమాదం వుందని విద్యార్థులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ మురుగునీరు ఎంపీడీవో కార్యాలయం రహదారి వరకు నిల్వ వుంది. అధికారులు స్పందించి మురికి నీటి నిల్వను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



కోనేరులో వున్న మురుగు నీరు

ఆ 'పూర్వ' సమ్మేళనం

ప్రొద్దుటూరు కల్చరల్ : సరిగ్గా 37 ఏళ్ల క్రితం విడిపోయిన స్నేహితులంతా ఓకే వేదికపై కలవడంతో వారి భావోద్వేగాలకు అంతు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని లింగాపురం వద్ద ఉన్న రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీలో 1986–87లో కలసి చదువుకున్న బీపీఈడీ, యూజీపీఈడీ విద్యార్థులు 37 ఏళ్ల తర్వాత ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆ బ్యాచ్ విద్యార్థి, ప్రస్తుతం ఇదే కాలేజీలో అధ్యాపకుడుగా పనిచేస్తున్న ఆకేపాటి శంకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థుల సంఘం సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి దాదాపు 70 మంది పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఒకరినొకరు మనసారా పలకరించుకుని, ఆ నాటి తీపిగుర్తులను కలబోసుకున్నారు. ఈ సందర్భంగా కాలేజీ పూర్వ అధ్యాపకులు పీకే సుబ్రహ్మణ్యం, శివశంకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డిని ప్రస్తుత కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రవిశంకర్, అధ్యాపకులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు.



రాయలసీమ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కాలేజీ 1986-87 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పోరుమామిళ్ల (అట్లూరు) : విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల, ఎనర్జీ అసిస్టెంట్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ అనుబంధ ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శులు కె.బ్రహ్మానందరెడ్డి, సురేష్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు సి.బ్రహ్మానందరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో 30 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల జీవితాల్లో ఎలాంటి పురోగతి లేదని తెలిపారు. అందరికి వెలుగులను అందించిన వీరు మాత్రం చీకట్లో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పాట్ బిల్లింగ్ చేసే కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వారందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాన్ని కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాలను అన్నింటిని ఐక్యం చేసి విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. సమావేశంలో ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ డివిజన్ కార్యదర్శులు గురుస్వామి, శివ, కేశవరెడ్డి, నాయకులు నవీన్, సుబ్బయ్య, రమేష్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, గురుస్వామి, ఓబయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి బ్రహ్మానందరెడ్డి

ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెరగాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి, వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు. స్థానిక నందిని క్లాత్ మార్కెట్‌లోని జనవిజ్ఞాన వేదిక కార్యాలయంలో జేవీవీ ప్రొద్దుటూరు పట్టణ వార్షిక ప్లీనం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 36 ఏళ్ల సైన్స్ ఉద్యమంలో ప్రొద్దుటూరుకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ప్రస్తుతం మానవ హక్కులకు భంగం కలిగినా ప్రశ్నించే తత్వం లేదని, భిన్న సంప్రదాయాలను, ప్రజాసామ్యాన్ని సహించే స్థితి ఉందన్నారు. ప్రజా స్వేచ్ఛకు భంగం కలుగుతోందని, సమాజంలో మార్పుకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక చేపట్టిన కార్యక్రమాల వివరాల నివేదకను ప్రధాన కార్యదర్శి సునీత వివరించారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ తవ్వా సురేష్, పోలంకి శ్రీరాములు, నంగా రాజేష్, ఈశ్వరయ్య, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు రఘునాథరెడ్డి

• ఘనంగా ఆషాఢ గుప్త నవరాత్రులు



చండీహోమం నిర్వహిస్తున్న వేద పండితులు

జమ్మలమడుగు పట్టణంలో ఆషాఢ గుప్త నవరాత్రుల మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ నెల 6న ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం సాయంత్రం ముగిశాయి. పట్టణంలోని గ్రంథే సోమేశ్వరస్వామి ఆలయంలో రోజూ లలితా సహస్రనామాలు, ఖడ్గనామాలు, వారాహి అష్టోత్తరం, కుంకుమార్చన, మహామంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం చండీహోమాన్ని గడియారం గిరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

– జమ్మలమడుగు

• వైభవంగా గజపూజ మహోత్సవం



గజపూజలో పాల్గొన్న మహిళలు, చిన్నారులు

పులివెందుల మండల పరిధిలోని యర్రబల్లె పంచాయతీలో ఉన్న మల్లికార్జునపురం గ్రామంలో ఆదివారం గజపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో గజపూజ నిర్వహించారు. గ్రామంలో చెక్క భజనలు నేర్చుకుని నెలరోజుల తర్వాత గజపూజ కార్యక్రమాన్ని గురువులు, మస్తాన్, కిషోర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. పెద్దలు, పిల్లలు, మహిళలు గజపూజలో పాల్గొని చెక్కభజనలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీగా తరలి వచ్చారు.

– పులివెందుల రూరల్

వైద్య శిబిరాలు నిర్వహించాలి

జమ్మలమడుగు : డయేరియా, టైఫాయిడ్, విషజ్వరాలు ప్రబలుతుండటంతో ప్రభుత్వం వార్డుల వారీగా వైద్య శిబిరాలు నిర్వహించాలని సీపీఐ నాయకుడు ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో వాతావరణ ప్రభావం చేత డయేరియా కేసులు రోజు రోజుకు పెరిగిపోతున్నాయన్నారు. అదే విధంగా విషజ్వరాలు, టైఫాయిడ్ వంటి వాటితో ప్రైవేట్ ఆసుపత్రుల బాట పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో ప్రజల జేబులకు చిల్లులు పడుతున్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజలకు వైద్య పరీక్షల నిర్వహించడం కోసం మెడికల్ క్యాంపులను నిర్వహించాలని సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

కడప రూరల్: ఉచిత వైద్య శిబిరాల వలన గ్రామీణ పేదలకు మెరుగైన వైద్య సేవలు లభిస్తాయని రామాస్ శ్రీకర ఆసుపత్రి ఛైర్మన్ డాక్టర్ రామాంజనేయరెడ్డి తెలిపారు. ఆదివారం చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆయన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు ఉచితంగా వైద్య చికిత్సలను అందించారు. నరాలు, ఎముకల వైద్యులు డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ ద్వారా లభించే వైద్య సేవలను వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రరామాస్, బీసీఎస్ బాబు తదితరులు పాల్గొన్నారు.

గండికోటను అభివృద్ధి చేయండి

జమ్మలమడుగు : పర్యాటక కేంద్రమైన గండికోట అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు జనసేన కోఆర్డినేటర్ నల్లంశెట్టి నాగార్జున వినతి పత్రం సమర్పించారు. ఆదివారం నంద్యాలకు వచ్చిన మంత్రిని ఆయన కలిసి వినతి పత్రం అందజేశారు. జైన మతానికి సంబంధించిన దానవులపాడు, మైలవరం మ్యూజియం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

జమ్మలమడుగు : కదిరి ప్రభాకర్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి పొన్నతోట జయచంద్ర పేర్కొన్నారు. స్థానికంగా ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కదిరి ప్రభాకర్ బంధువులు చనిపోవడంతో ఒంటిమిట్ట గ్రామానికి వెళ్లి అంత్యక్రియలను ముగించుకుని వస్తున్న సమయంలో కళ్లు తిరగడంతో సమీపంలో ఉన్న అరుగు మీద నిద్రించాడని పేర్కొన్నారు. అయితే తమ ఇంటి ముందు నిద్రిస్తావా అంటూ గజ్జల వెంకటసుబ్బారెడ్డి కర్రతో దాడి చేయడంతోపాటు అతనిపై వేడి నూనె పోశారన్నారు. దీంతో ప్రభాకర్ శరీరం కాలిపోవడంతో కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడన్నారు. అధికారులు బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాలమహానాడు ఆధ్వర్యంలో ఉద్యమిస్తామన్నారు.

ఆ ఉద్యోగులపై విచారణ చేయండి

పులివెందుల రూరల్ : వేంపల్లె పంచాయతీ కార్యాలయంలో ఒక రికార్డు అసిస్టెంట్, ఇద్దరు బిల్ కలెక్టర్లు ఎటువంటి విధులు నిర్వహించకుండా జీతాలు తీసుకోవడం దారుణమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ అన్నారు. స్థానికంగా ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్యాలయంలో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ ఇక్కడ అవినీతి చేస్తున్నట్లు తెలిసి పోరుమామిళ్లకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారని, అయితే ఉన్నతాధికారుల అండతో తిరిగి వేంపల్లె పంచాయతీ కార్యాలయానికి వచ్చి ఎటువంటి విధులు నిర్వహించకుండా జీతం తీసుకోవడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. 2020 నుంచి 2022 వరకు ఆయన చేసిన అవినీతి, అక్రమాలకు సంబంధించి వివరాలు తమ వద్ద ఉన్నాయని, విచారణ అధికారులు వస్తే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు సుష్మా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్, ప్రసాద్‌రెడ్డి, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్

ఎర్రగుంట్ల : మండల పరిధి పోట్లదుర్తి గ్రామ పంచాయతీలోని రామాంజనేయపురం గ్రామంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు లారీలు, ట్రాక్టర్, జేసీబీలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ చిరంజీవి ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా వచ్చిన సమాచారం మేరకు దాడి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. జేసీబీతోపాటు ఒక ట్రాక్టర్, రెండు లారీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వైవీయూకు వీసీ, రిజిస్ట్రార్‌లను నియమించాలి

కడప వైఎస్సార్ సర్కిల్ : యోగి వేమన విశ్వ విద్యాలయానికి రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్ లేకపోవడం వలన వర్సిటీ పాలన గాడితప్పిందని వెంటనే ప్రభుత్వం స్పందించి వీసీ, రిజిస్ట్రార్‌ల నియామకం చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వర్సిటీలో 20కి పైగా పీజీ కోర్సులు, పరిశోధనలు, జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, లా, బీఎడ్, ఒక ఇంజనీరింగ్ కాలేజీతోపాటు అనుబంధంగా అనేక కళాశాలలు ఉన్నాయన్నారు. వీటిపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ ఉండాలంటే రెగ్యులర్ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌ల నియామకం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి కే శివశంకర్, నగర ఉపాధ్యక్షుడు అకిరానంద్, తేజ, అశోక్, చంద్ర, పహిద్, రాజేష్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగర శివార్లలోని బృంద వృద్ధాశ్రమంలో దివంగత జితేంద్రకుమార్ సంస్మరణగా ఆదివారం ఆయన బంధువు, న్యాయవాది బాలాజీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్రకుమార్ కుటుంబ సభ్యులు వృద్ధాశ్రమానికి రెండు ప్యాకెట్ల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు విజయలక్ష్మీ, లోకేష్, మహేష్, భరత్, వృద్ధాశ్రమ మేనేజర్ సుధారాణి తదితరులు పాల్గొన్నారు.